www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 29 డిసెంబర్ 2025
5
పశ్చిమ గోదావరి

నేడు కలెక్టరేట్‌లో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'
1100 కాల్ సెంటర్, ఆన్‌లైన్ సేవలు వినియోగించుకోవాలి : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

జిల్లా ప్రజలు సమస్యల పరిష్కారం కోసం సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. అర్జీదారులు తమ సమస్యకు సంబంధించిన పూర్తి వివరాలతో కూడిన అర్జీని సమర్పించాలన్నారు. అర్జీదారులు కలెక్టరేట్‌కు రాకుండానే తమ సమస్యలను నమోదు చేసుకునేందుకు ప్రభుత్వం కల్పించిన 1100 టోల్ ఫ్రీ నంబరును సంప్రదించవచ్చునని సూచించారు. గతంలో ఇచ్చిన అర్జీల స్టేటస్ తెలుసుకోవడానికి కూడా ఈ నంబర్‌కు కాల్ చేయవచ్చన్నారు. అలాగే meekosam.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో కూడా అర్జీలను సమర్పించవచ్చునని తెలిపారు. జిల్లా ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు సత్వర పరిష్కారం పొందాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

ఉప్పుటేరుకు కాలుష్యం కాటు

- ఉప్పుటేరు కలుషితంతో అంతరిస్తున్న మత్స్య సంపద
- 22 వేల మత్స్యకార కుటుంబాలకు ఇదే జీవనాధారం

కాలుష్యంగా మారిన ఉప్పుటేరు

ఉప్పుటేరు
ఉప్పుటేరు కాలుష్యం కాటుకు గురై క్రమంగా ఉనికిని కోల్పోతుంది. వ్యర్థాలు, ఆక్వా సాగుకు వాడే మందుల నీరు దీనిలో కలిసి కాలుష్య కాసారంగా తయారవుతోంది. పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల సరిహద్దుల్లో ప్రవహించే జీవనది ఉప్పుటేరు. కొల్లేరు సరస్సుకు బంగాళాఖాతానికి అనుసంధానంగా ఉన్న ఈ ఉప్పుటేరుకు ఇరువైపులా వేలాది మత్స్యకార కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. దీనిలో లభ్యమయ్యే చేపలే వీరికి జీవనాధారం. అవి నిండుగా దొరికిన రోజు మస్తు.. లేని రోజు పస్తు. ఒకప్పుడు కాసులు కురిపించిన ఉప్పుటేరు ప్రస్తుతం మత్స్యకారులను కన్నీరు పెట్టిస్తోంది.

ప్రజాశక్తి - కాళ్ల

ఉప్పుటేరు 20 అడుగుల సగటు లోతున 65 కిలోమీటర్ల మేర ప్రవహిస్తోంది. సుమారు 30 పరీవాహక గ్రామాలున్నాయి. 22 వేల కుటుంబాలు ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. లభ్యమయ్యే మత్స్య జాతులు 40. ప్రస్తుతం వాటిలో సగానికి సగం దొరకని పరిస్థితి. ఉప్పుటేరు దుస్థితి ప్రభావం భవిష్యత్తులో కొల్లేటి సరస్సుపైన పడే అవకాశం ఉంది. కైకలూరు మండలం కొల్లేరు నుంచి మొదలైన ఉప్పుటేరు ఆకివీడు, ఏలూరుపాడు, మోడి మీదుగా ప్రవహించి కృష్ణా జిల్లా కృత్తివెన్ను మండలంలోని లక్ష్మీపురం-పల్లిపాలెం వద్ద రెండు పాయలుగా విడిపోయింది. దీనిలో ఒకటి మన జిల్లాలోని కాళీపట్నం వద్ద, మరొకటి పడతడిక మీదుగా వెళ్లి దిబ్బలపాలెం వద్ద సముద్రంలో కలుస్తున్నాయి. కొల్లేటి సరస్సు నుంచి ప్రతిరోజూ 10 వేల నుంచి 15 వేల క్యూసెక్కుల నీరు సముద్రానికి చేరుతుంది. ఉప్పుటేరు లోతు ప్రాంతాన్ని బట్టి సగటున 20 అడుగుల వరకు ఉంటుంది.

కాలుష్య కాసారం ఉప్పుటేరు

కొల్లేరును అనుసంధానంగా ఉన్న ఈ ఉప్పుటేరు ఒకప్పుడు స్వచ్ఛమైన నీటితో ఉండేది. దీనిని ఆనుకుని ఉన్న గ్రామాల ప్రజలు ఆ నీటిని తాగునీటిగా వినియోగించేవారు. ఆ పరిస్థితి ఇప్పుడు తారుమారైంది. ఆక్వా రంగం ప్రారంభమైన తొలినాళ్లలో దీనిపై పెద్దగా ప్రభావం పడలేదు. రానురాను ఉప్పుటేరుకు ఆనుకుని వేలాది ఎకరాల్లో చేపలు, రొయ్యల చెరువులు ఇబ్బడిముబ్బడిగా తవ్వడం ప్రధాన సమస్యగా మారింది. నిబంధనలకు విరుద్ధంగా తవ్వారా, లేదా నిబంధనల ప్రకారమే తవ్వారా అనేది పక్కన పెడితే చెరువుల నిర్వాహకుల నిర్లక్ష్యం కారణంగా ఉప్పుటేరు కాలుష్యం బారిన పడింది. చెరువుల్లోంచి ఆక్వా వ్యర్థ నీటిని బయటకు వదిలేసేప్పుడు శుద్ధి చేయకపోవడమే దీనికి కారణం. అధిక రసాయనాల వాడకం మరింత ప్రమాదకరంగా మారింది. పశ్చిమగోదావరి-ఏలూరు జిల్లాల సరిహద్దుల్లో ఆక్వా అనుబంధ పరిశ్రమల వ్యర్థాలు, రొయ్యల చెరువుల్లోని వ్యర్థాలు ఈ ఉప్పుటేరులో కలుస్తున్నాయి. ఫలితంగా సహజ సిద్ధమైన అనేక రకాల చేప జాతులు క్రమంగా అంతరించిపోతున్నాయి.

జీవనోపాధి కోల్పోతున్న మత్స్యకారులు

ఉప్పుటేరు తీరాన్ని ఆనుకుని పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా జిల్లాల్లో సుమారు 30 మత్స్యకార గ్రామాలున్నాయి. 22 వేల కుటుంబాలు ఈ ఉప్పుటేరులో సహజ సిద్ధమైన మత్స్య సంపదపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. వలకట్లు, విసురు వల, తెలువల, గూళ్లు, కంపలు వంటి ప్రక్రియ ద్వారా ఉప్పుటేరు నుంచి మత్స్య సంపదను మత్స్యకారులు చేజిక్కించుకునేవారు. ఒకప్పుడు ఏటిలో సుమారు 40 నుంచి 30 రకాల జాతులకు చెందిన మత్స్య సంపద లభించేది. ఉప్పుటేరు కలుషితంతో 20 రకాల జాతులు అంతరించిపోయాయని మత్స్యకారులు అంటున్నారు. ప్రస్తుతం 10 నుంచి 15 రకాల చేపలు మాత్రమే ఉప్పుటేరులో లభ్యమవుతున్నాయి. అవి అంతంత మాత్రంగానే వలలకు చిక్కుతున్నాయి. వలలకు మత్స్య సంపద దక్కని పరిస్థితుల్లో మత్స్యకారులు పస్తులుండాల్సి వస్తోంది.

కొల్లేటి సరస్సుకు ముప్పు

ఉప్పుటేరు కాలుష్యం ప్రభావం కొల్లేరు సరస్సుపై పడుతుందని ప్రకృతి ప్రేమికులు ఆవేదన చెందుతున్నారు. పోటు సమయంలో ఏరులోని నీరు సముద్రంలోకి వెళ్తోంది. పోటు సమయంలో సముద్రపు నీరు ఎగదన్నుతుంది. దీంతో ఉప్పుటేరులోని నీరు కొల్లేరులో కలుస్తుంది. దీనివల్ల అక్కడ మత్స్య సంపదతోపాటు విదేశాల నుంచి వచ్చే పక్షులకు భవిష్యత్తులో ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది.

వలసలు తప్పవు
తిరుమాని శ్రీనివాస్, మత్స్యకారుడు, ప్రాతళ్ల మెరక

మత్స్యజాతులు చాలా వరకు అంతరించిపోవడం వల్ల రోజంతా ఉప్పుటేరులో చేపల కోసం వేటాడినా పూట గడవడం కష్టంగా మారింది. దీంతో చాలా కుటుంబాలు ఇతర ప్రాంతాలకు వెళ్లి స్థిరపడుతున్నారు. కొంతమంది రొయ్యల చెరువుల కాపలాదారులుగా, మరికొంతమంది చేపల పట్టుబడికి వెళ్తున్నారు. ఊళ్లకు ఊళ్లు ఖాళీ చేసే పరిస్థితి రాకముందే ఉప్పుటేరును రక్షించాలి. ఆక్వా సాగు విస్తరణతో ఉప్పుటేరులోకి కలుషిత జలాలు యథేచ్ఛగా కలుస్తున్నాయి. వాటి ప్రభావం వల్ల మత్స్య సంపద మరింత తగ్గే ప్రమాదం ఉంది. ఉప్పుటేరును కాలుష్యం నుంచి ప్రక్షాళన చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.

ఆక్వా వ్యర్థాలు కలవకుండా చర్యలు తీసుకోవాలి
మోపిదేవి శ్రీనివాసరావు, కాళ్ల మత్స్యకార సంఘ నాయకుడు



ఉప్పుటేరులోని మత్స్య సంపదపై ఆధారపడి వేలాది కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. 20 సంవత్సరాల క్రితం ఉప్పుటేరు నీటిని తాగడానికి ఉపయోగించేవారు. ప్రస్తుతం ఆ నీరు తాగేందుకు పనికి రావడం లేదు. ఉప్పు శాతం పెరిగిపోయింది. రొయ్యల చెరువుల్లోని కలుషిత వ్యర్థాలు ఉప్పుటేరులోకి వదలడంతో ఉప్పుటేరు కలుషితమైంది. ఆక్వా అనుబంధ పరిశ్రమల నుంచి వచ్చే వ్యర్థాల వల్ల మత్స్యసంపదకు మరికొంత నష్టం వాటిల్లుతుంది. ఉప్పుటేరులోకి కలుషిత వ్యర్థాలు వదలకుండా నివారించగలిగితే భవిష్యత్తు తరాలకు మేలు జరుగుతుంది.

ఎఐ ఆధారిత నైపుణ్యం పెంపునకు కృషి

కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్



డ్రోన్ రిపేర్ గురించి అడిగి తెలుసుకుంటున్న మంత్రి

ప్రజాశక్తి - నరసాపురం

గ్రామీణ ప్రాంతంలో ఎఐ ఆధారిత నైపుణ్యం పెంపునకు కృషి చేస్తున్నట్లు కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. మండలంలోని పెదమైనవానిలంక డిజిటల్ భవన్‌లో 'సైయెంట్ ఎఐ అండ్ ఫ్యూచర్ స్కిల్స్ హబ్'ను ఆమె ఆదివారం లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో సైయెంట్ వ్యవస్థాపక ఛైర్మన్ డాక్టర్ బివిఆర్.మోహన్‌రెడ్డి, కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ, రాష్ట్ర మంత్రులు పయ్యావుల కేశవ్, డాక్టర్ నిమ్మల రామానాయుడు, సైయెంట్ వ్యవస్థాపక ఛైర్మన్ డాక్టర్ బివిఆర్.మోహన్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఎంఎల్‌ఎలు బొమ్మిడి నాయకర్, పితాని సత్యనారాయణ, ఆరిమిల్లి రాధాకృష్ణ, బొలిశెట్టి శ్రీనివాస్, ఎపిఐఐసి ఛైర్మన్ మంతెన రామరాజు, జిల్లా నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ సైయెంట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దీనిని మోడల్ ఎఐ-ఆధారిత గ్రామీణ నైపుణ్య, జీవనోపాధి కేంద్రంగా మార్చే లక్ష్యంతో నెలకొల్పామన్నారు. ఈ కేంద్రంలో ఎఐ-ఆధారిత వ్యవస్థలు, స్మార్ట్ తరగతి గదులు, 40-సిస్టమ్ కంప్యూటర్ ల్యాబ్, డ్రోన్ శిక్షణ పరికరాలు, హైస్పీడ్ కనెక్టివిటీ, లైసెన్స్ పొందిన, ఓపెన్ సోర్స్ ఎఐ సాధనాలు, నిర్మాణాత్మక శిక్షణ డెలివరీ, రియల్ టైమ్ ట్రాకింగ్, ఫలిత కొలతను ప్రారంభించే కేంద్రీకృత అభ్యాస నిర్వహణ వ్యవస్థ ఏర్పాటు చేశామన్నారు. శిక్షణలో పాల్గొనేవారికి సర్టిఫికెషన్, ప్లేస్‌మెంట్ ఇవ్వాలన్నారు. స్వయం ఉపాధికి అవకాశంగా ఉంటుందన్నారు. సైయెంట్ లిమిటెడ్ వ్యవస్థాపక ఛైర్మన్ డాక్టర్ బివిఆర్.మోహన్‌రెడ్డి మాట్లాడుతూ సైయంట్ ఫౌండేషన్ 120కి పైగా ప్రభుత్వ పాఠశాలలను విజయవంతంగా డిజిటలైజ్ చేసిందన్నారు. 35 వేల మందికిపైగా విద్యార్థులకు డిజిటల్ అక్షరాస్యతతో చేరువైందని తెలిపారు.

'బాలోత్సవం' సమాజానికి అవసరం

పిల్లల్లో దేశభక్తి భావాలు, ప్రగతిశీల ఆలోచనలకు దోహదం
పోస్టర్, బ్రోచర్ ఆవిష్కరణలో ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ

పోస్టర్, బ్రోచర్‌లను విడుదల చేస్తున్న ఎంఎల్ఎ ఆరిమిల్లి

ప్రజాశక్తి - తణుకు

బాలోత్సవం వంటి మహత్తర కార్యక్రమాలు సమాజానికి అవసరమని, పిల్లల్లో దేశభక్తి భావాలను, ప్రగతిశీల ఆలోచనలను పెంపొందిస్తాయని ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. తణుకు పట్టణంలో 2026 జనవరి 23 నుండి 25 వరకు నిర్వహించనున్న బాలోత్సవం, వందేమాతరం గీతానికి 150 సంవత్సరాలు పూరైన సందర్భంగా తెలగు బుక్ ఆఫ్ రికార్డ్స్ ఆధ్వర్యాన చేపట్టనున్న సామూహిక గీతాలాపనకు సంబంధించిన పోస్టర్, బ్రోచర్‌లను ఎంఎల్ఎ రాధాకృష్ణ విడుదల చేశారు. బాలోత్సవం అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి పిఎల్.నరసింహారావు, దక్షిణామూర్తి, కోశాధికారి ఎఎస్‌వి.శేషుబాబు మాట్లాడుతూ.. మండలంలోని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల విద్యార్థులు పాల్గొనే విధంగా సుమారు 50 పోటీ కార్యక్రమాలు నిర్వహించబడతాయని తెలిపారు. ఇందులో 4 వేలకు పైగా విద్యార్థులు వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని ఒక మెగా ఈవెంట్‌గా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యాకాంత్, త్రిపాఠి, గోపి, కోడూరి ఆంజనేయులు, మల్లిన రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలపై విస్తృత పోరాటాలు

- వేతన ఒప్పందాలపై ప్రత్యేక దృష్టి
- లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా
- జిల్లావ్యాప్తంగా ఆందోళనలు
- అఖిలభారత మహాసభ విజయవంతానికి విస్తృత ప్రచారం
- 30న భీమవరంలో శ్రామిక ఉత్సవ్ నిర్వహణ
- విశాఖ సభకు జిల్లా నుంచి 10 వేల మంది హాజరు
- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.వాసుదేవరావు

ప్రజాశక్తి - భీమవరం

'కార్మికోద్యమ చరిత్రలో పశ్చిమగోదావరి జిల్లాకు ప్రత్యేక స్థానం ఉంది. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, కర్షకులకు అండగా సిఐటియు నిరంతరం పోరాడుతూ ఉంది. గత మూడేళ్ల కాలంలో కార్మికుల సమస్యలపై జిల్లాలో విస్తృత పోరాటాలు నిర్వహించాం' అని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.వాసుదేవరావు తెలిపారు. యాజమాన్యాలు దుర్మార్గంగా ప్రభుత్వాలను అడ్డం పెట్టుకుని కార్మికుల తొలగింపునకు పూనుకుంటే అడ్డుకున్నామన్నారు. పరిశ్రమ ప్రమాదాల్లో కార్మికులు చనిపోతే కుటుంబాలకు నష్టపరిహారం ఇప్పించి అండగా నిలబడ్డామని, వేతన ఒప్పందాలపై ప్రత్యేక దృష్టి పెట్టి విజయవంతంగా పూర్తి చేశామని వివరించారు. సిఐటియు అఖిల భారత మహాసభ సందర్భంగా ప్రజాశక్తికిచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన పలు వివరాలు వెల్లడించారు.

ప్రశ్న: జిల్లాలో ఈ కాలంలో ఎటువంటి పోరాటాలు చేశారు. కార్మికులకు ఏమైనా నష్టపరిహారాలు ఇప్పించారా?

జవాబు: తాడేపల్లిగూడెం ట్రిబుల్ ఎఫ్‌లో వేతన ఒప్పందంపై రెండు నెలలపాటు ధర్నాలు, ఆందోళనలు, నిరాహార దీక్షలు చేశాం. 2024లో సిపిఎఫ్ పరిశ్రమ మూసివేతకు వ్యతిరేకంగా రెగ్యులర్ కార్మికులతోపాటు ఆందోళన నిర్వహించి 90 మంది కార్మికులకు నష్టపరిహారం ఇప్పించాం. తణుకు ఎపి సీడ్స్‌లో హమాలీ కార్మికుల పని భద్రతపై రెండు నెలలపాటు దశలవారీ ఆందోళన నిర్వహించాం. భీమవరం గ్యాస్ డెలివరీ బోయ్స్ అక్రమ తొలగింపునకు వ్యతిరేకంగా సుమారు మూడు నెలలపాటు ఆందోళనలు సాగించాం. గ్యాస్ ప్రమాదంలో మృతి చెందిన కార్మికుని కుటుంబానికి రూ.9.50 లక్షలు పరిహారం ఇప్పించాం. భీమవరం ఆక్వా క్లస్టర్లో సూర్యమిత్ర పరిశ్రమలో అక్రమ తొలగింపునకు వ్యతిరేకంగా 20 రోజులపాటు దశలవారీ ఆందోళన నిర్వహించాం. భీమవరం, పాలకొల్లు, ఆకివీడు, పెనుగొండ, పెనుమంట్ర, తాడేపల్లిగూడెం ప్రాంతాల్లో రైస్‌మిల్ కార్మికుల వేతన ఒప్పందాలు నిర్వహించాం. పెనుగొండలో రైస్‌మిల్ కార్మికుడు మృతి చెందితే వారి కుటుంబానికి రూ.3.50 లక్షలు నష్టపరిహారం ఇప్పించాం. 42 రోజులపాటు అంగన్వాడీల సమ్మెలో భీమవరం, నర్సాపురం, తాడేపల్లిగూడెం ఆర్‌డిఒ కేంద్రాల్లో జరిగిన ప్రదర్శనలో సుమారు మూడు వేల మంది అంగన్వాడీలు పాల్గొన్నారు. చలో విజయవాడకు 1584 మంది బయలుదేరితే 600 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. భీమవరం కలెక్టరేట్ వద్ద ఎస్ఎస్ఎ ఉద్యోగులు ఆందోళనకు సంఘీభావం తెలిపాం. తాడేపల్లిగూడెం, తణుకు, భీమవరం, ఆకివీడు ప్రాంతాల్లో మున్సిపల్ కార్మికులు సమ్మె విజయవంతం చేశారు.

ప్రశ్న: కార్మికుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాలపై ఎటువంటి పోరాటాలు చేశారు?

జవాబు: మోడీ ప్రభుత్వం కార్మిక రైతు వ్యతిరేక విధానాలు నిరసిస్తూ జిల్లాలో మూడు రోజుల పాటు ప్రచార యాత్ర నిర్వహించాం. సంయుక్త కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరిగిన దేశవ్యాప్త గ్రామీణ బంద్ విజయవంతం చేశాం. లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని కోరుతూ నిరసనలు చేపట్టాం. జీపు జాతాలు, ట్రేడ్ యూనియన్ల జిల్లా సదస్సులు, రౌండ్‌టేబుల్ సమావేశాలు, మోటార్ సైకిల్ ర్యాలీలు ఇలా వివిధ రూపాల్లో నిరసనలు తెలిపాం.

ప్రశ్న: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు, సీమ్ వర్కర్లకు ఇచ్చిన హామీలు అమలు తీరుపై మీ స్పందన?

జవాబు: అంగన్వాడీలు, మున్సిపల్ కార్మికులు, సమగ్రశిక్ష అభియాన్ ఉద్యోగులు, ఆశ, మధ్యాహ్న భోజన కార్మికులు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ రంగాల్లోని ఐకెపి విద్యుత్ ఉద్యోగులు, ప్రభుత్వ రంగంలో పని చేస్తున్న వివిధ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు అనేక హామీలు ప్రభుత్వాలు ఇచ్చినప్పటికీ ఏఒక్కటీ పూర్తిస్థాయిలో అమలు చేయలేదు. నూతన పిఆర్‌సి అమలుకు సంబంధించి కనీసం కమిటీ కూడా ఏర్పాటు చేయలేకపోయారు. సిపిఎస్ రద్దు చేయలేదు. ఒపిఎస్ అమలు కాలేదు. ఇలా చెప్పుకుంటే అనేక హామీలు ఇచ్చారే తప్ప అమలు చేయలేదు. ఇచ్చిన హామీలు అమలు పక్కనబెట్టి, కార్మికులు, ఉద్యోగుల హక్కులు హరించే విధానాలను ప్రభుత్వాలు అత్యంత దుర్మార్గంగా అమలు చేస్తున్నాయి.

ప్రశ్న: సిఐటియు అఖిల భారత మహాసభ ప్రచారం జిల్లాలో ఎలా సాగింది?

జవాబు: జిల్లాలో 20 మండలాలు, ఐదు మున్సిపాల్టీలు, ఒక నగర పంచాయతీ పరిధిలో అఖిలభారత మహాసభ ప్రచారం విస్తారంగా సాగింది. 50 వేల కరపత్రాలు, 10 వేల బహిరంగ సభ పోస్టర్లు ద్వారా ప్రచారం చేశాం. ప్రభుత్వ విధానాలు-ఉద్యోగ, కార్మికులపై ప్రభావం అనే అంశంపై సెమినార్ నిర్వహించాం. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, కర్షకులను అందరినీ కలిసి మహాసభను విజయవంతం చేయాలని ప్రచారం సాగించాం. వీటితోపాటు సన్నాహక సమావేశాలు, గ్రూపు మీటింగులు ద్వారా కార్మికులను సమాయత్తపర్చడం, మహాసభ విశిష్టతను చాటి చెప్పి అటువైపు నడిపించడం జరిగింది. తాడేపల్లిగూడెంలో శ్రామిక ఉత్సవ్ అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో నిర్వహించారు. 18 అడుగుల పతాకాల ఆవిష్కరణ, బైక్ ర్యాలీలు నిర్వహించాం. ఈ నెల 30న భీమవరంలో శ్రామిక ఉత్సవ్‌లో భాగంగా ఆటపాట కార్యక్రమాలను పెద్దఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

ప్రశ్న: జిల్లా నుంచి బహిరంగ సభకు ఎంతమంది హాజరు కానున్నారు?

జవాబు: రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా సిఐటియు అఖిల భారత మహాసభ విశాఖపట్నంలో జరుగుతుంది. ఈ నేపథ్యంలో జనవరి 4వ తేదీన విశాఖపట్నంలో జరిగే ప్రదర్శన, బహిరంగ సభకు జిల్లా నుంచి పది వేల మంది కార్మికులు హాజరు కానున్నారు. ఇప్పటికే అనేకమంది ప్రయాణానికి అవసరమైన ఏర్పాట్లు కూడా పూర్తి చేసుకున్నారు.

ఉపాధి హామీని పథకంగా మార్చడం సరికాదు

వ్యకాస మండల కార్యదర్శి మూడే మోజెష్

నిరసన తెలుపుతున్న ఉపాధి కూలీలు, నేతలు

ప్రజాశక్తి - పోడూరు

ఉపాధి హామీ చట్టాన్ని పథకంగా మార్చడం న్యాయం కాదని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి మూడే మోజెష్ అన్నారు. చట్టాన్ని పథకంగా మార్చి ఉపాధి పని లేకుండా చేయాలని ప్రభుత్వం చూస్తుందని విమర్శించారు. జగన్నాధపురంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన ఆదివారం ఉపాధి హామీ పనులు నిర్వహిస్తున్న ప్రదేశంలో ఉపాధి కూలీలతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు పిల్లి ప్రసాద్, మోజెష్ మాట్లాడుతూ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్రం కుట్ర పన్నిందన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కృష్ణ, సత్యనారాయణ, లక్ష్మి ఉన్నారు.

జిల్లాలో రెవెన్యూ క్లినిక్‌ల ఏర్పాటు : జెసి

భీమవరం : రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సమస్యల సత్వర పరిష్కారానికి రెవెన్యూ క్లినిక్‌ల ఏర్పాటుకు ఆదేశాలు జారీ చేయడం జరిగిందని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.రాహుల్‌కుమార్ రెడ్డి తెలిపారు. దీని ద్వారా జిల్లాలో రెవెన్యూ సమస్యలు వేగవంతమైన పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ప్రతి సోమవారం పిజిఆర్ఎస్‌కు సమాంతరంగా, ప్రతి రెవెన్యూ సమస్య పరిష్కారానికి ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి అర్జీలను స్వీకరించడం జరుగుతుందన్నారు. అర్జీ పరిశీలించిన వెంటనే సంబంధిత రెవెన్యూ అధికారితో మాట్లాడి వెంటనే పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. తక్షణ పరిష్కారానికి ఆస్కారం లేని వాటిని పూర్తిస్థాయిలో పరిశీలించి పరిష్కరించడం జరుగుతుందన్నారు. ప్రజలు ఆర్ఒఆర్‌కు సంబంధించిన సమస్యలు, పట్టాదారు పాస్ బుక్‌లు, ఆర్ఒఎఫ్ఆర్, రెగ్యులేషన్ ఆఫ్ 1/70, రీ సర్వే, అడంగల్, వెబ్ ల్యాండ్, ఎఫ్ లైన్ పిటిషన్ వంటి అంశాలపై సమస్యలు ఉంటే అర్జీలను సమర్పించి సమస్యలను పరిష్కరించుకోవచ్చుని స్పష్టం చేశారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రోడ్డు నిర్మించాలి : సిపిఎం

ఇరగవరం : ఇరగవరం నుండి గొల్లగుంట మీదుగా ఏలేటిపాడు వెళ్లే రోడ్డు ప్రమాదాలకు నిలయమై ఉందని సిపిఎం మండల కన్వీనర్ కామన మునిస్వామి అన్నారు. ఈ రోడ్డు నిర్మాణాన్ని చేపట్టాలని ఆదివారం సిపిఎం ఆధ్వర్యాన నిరసన తెలియజేశారు. ఈ రోడ్డు గుండా నిత్యం రైతులు వ్యవసాయ, ఇతర పనుల కోసం తిరుగుతూ ఉంటారని, విద్యాసంస్థల స్కూల్ ఆటోలు, వ్యాన్లు, రవాణా వాహనాలు ఎక్కువగా ఈ రోడ్డు నుండే ప్రయాణాలు సాగుతాయన్నారు. ప్రజలు నిత్యం ప్రయాణాలు కొనసాగిస్తూ ఉంటారని, అటువంటి రోడ్డు పాడైపోయి, గుంటలు ఏర్పడి ప్రమాదాలకు నిలయంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే అనేకమంది ప్రమాదాలకు గురై ఆసుపత్రి పాలవుతూ వికలాంగుల వుతున్నారని, ప్రాణాపాయ స్థితిలో కూడా ఉంటున్నారని, ఇది కేవలం ప్రభుత్వ నిర్లక్ష్యమని, ఈ రోడ్డును వెంటనే నిర్మాణం చేపట్టాలని మునిస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలు పరిష్కరించకపోతే ప్రజలే ఉద్యమకారులుగా మారి సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కె.త్రిమూర్తులు, జుత్తిగా రామాంజనేయులు, కేత సత్యనారాయణ పాల్గొన్నారు.

సిఐటియు మహాసభ.. వెళ్దాం పద పద

భీమవరంలో 18 అడుగుల సిఐటియు పతాకావిష్కరణ
పలుచోట్ల మోటారు సైకిల్ యాత్రలు
విశాఖ శ్రామిక ఉత్సవ్‌లో నేడు 'మన్యం విప్లవం' వీధి నాటిక ప్రదర్శన

ఉండిలో..

ప్రజాశక్తి - భీమవరం

విశాఖపట్నంలో ఈ నెల 31 నుంచి జనవరి 4వ తేదీ వరకు నిర్వహించబోయే సిఐటియు అఖిలభారత 18వ మహాసభ ప్రచార కార్యక్రమాలు జిల్లాలో ముమ్మరంగా సాగుతున్నాయి. దీనిలో భాగంగా భీమవరం మున్సిపల్ కార్మికవాడలో 18 అడుగుల సిఐటియు పతాకాన్ని కార్మికులు ఆదివారం ఆవిష్కరించారు. 4న బహిరంగ సభ, ప్రదర్శనల్లో కార్మికులంతా పాల్గొని జయప్రదం చేయాలని నినదించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.వాసుదేవరావు మాట్లాడారు ఒకపక్క పెరుగుతున్న ధరలు, మరోవైపు ఉపాధి లేక చిన్న చిన్న వృత్తులు చేసుకునే కార్మికులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలు రద్దు చేసే అధికారం ఎవరిచ్చారని ప్రశ్నించారు. రానున్న రోజుల్లో హక్కుల సాధనకు పెద్దఎత్తున పోరాటాల రూపకల్పనకు సిఐటియు అఖిలభారత 18వ మహాసభ వేదిక కాబోతుందన్నారు.

భీమవరం మండలంలో

తణుకు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల పక్కనుంటాయో, కార్పొరేట్ల పక్కనుంటాయో తేల్చుకోవాలని సిఐటియు జిల్లా కోశాధికారి పివి.ప్రతాప్, మండల కన్వీనర్ గుబ్బల గోపి హెచ్చరించారు. ఆదివారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద హలో కార్మిక-చలో విశాఖ బహిరంగ సభ కరపత్రాన్ని పంపిణీ చేశారు. ముఖ్యకూడలిలో బ్యానర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రతాప్, గోపి మాట్లాడుతూ జనవరి 4న విశాఖ పట్నంలో జరిగే బహిరంగ సభకు ఉద్యోగులు, కార్మికులు పెద్దసంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల కోకన్వీనర్ ఎన్.ఆదినారాయణబాబు, నేతలు కె.అయ్యప్ప, ఎం.నాగేంద్రకుమార్, జి.పెద్దిరాజు పాల్గొన్నారు.

ఆకివీడు: సిఐటియు అఖిల భారత మహాసభలో భాగంగా విశాఖపట్నంలో నిర్వహిస్తున్న శ్రామిక ఉత్సవ్‌లో మన్య విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు వీధి నాటిక ప్రదర్శించనున్నట్లు సిఐటియు జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు, కె.తవిటినాయుడు తెలిపారు. ప్రజానాట్యమండలి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో షేక్ వలీ నాయకత్వంలో 'మన్య విప్లవం' వీధి నాటిక శిక్షణ కార్యక్రమాన్ని స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నాటిక ఈ నెల 29వ తేదీ సోమవారం శ్రామిక ఉత్సవ్‌లో ప్రదర్శించనున్నామన్నారు. జిల్లా నలుమూలల నుండి 20 మంది కళాకారులు ఈ శిక్షణలో పాల్గొన్నారని తెలిపారు. కార్యక్రమంలో కళాకారులు పోతు శ్రీను, పాపారావు, ఆకుల రాజు, వెంకటేశ్వర రావు, శ్రీరామ్, భగత్ తదితరులు పాల్గొన్నారు.

ఆకివీడులో కళాకారుల రిహార్సల్స్

భీమవరం టౌన్: రూరల్ మండలంలోని తోకతిప్ప మోటార్ సైకిల్ ర్యాలీ సిఐటియు జిల్లా నేత ఇంజేటి శ్రీనివాస్ ఆదివారం ప్రారంభించారు. ఈ ర్యాలీ నాగేంద్రపురం, నాగిడిపాలెం, దొంగపిండి, కొత్త పూసలమర్రు, గూట్లపాడు, గొల్లవానితిప్ప గ్రామాల మీదుగా సాగింది. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో కరపత్రాలు విస్తృతంగా పంచామన్నారు. కార్యక్రమంలో బి.లక్ష్మీపతి, కనుమూరి కృష్ణంరాజు, తోటి శుభకరరావు, తిరుమాని నాగేశ్వరరావు పొన్నమండ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తణుకు పట్టణంలో..

ఉండి: విశాఖలో జనవరి 4న జరిగే బహిరంగ సభకు తరలి రావాలని, కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక చట్టాలపై పోరాటాలకు సన్నద్ధం కావాలని సిఐటియు మండల కన్వీనర్ ధనికొండ శ్రీనివాస్ పిలుపు నిచ్చారు. ఆదివారం సిఐటియు ఆధ్వర్యాన బైక్, ఆటో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మండల కోకన్వీనర్ కొట్టాడ వెంకటేశ్వరరావు, నేతలు వీరవల్లి మాధవరావు, రామకూరి వెంకటరత్నం, పెల్లూరి సుబ్రహ్మణ్యం, ఇర్రింకి శ్రీరామ్మూర్తి, మంగం శ్రీనివాస్, కుక్కల లోకేష్, కొట్టాడ భాను పాల్గొన్నారు.

సుబ్బరాజు మృతి బాధాకరం

ఎపిడబ్ల్యూజెఎఫ్ జిల్లా అధ్యక్షుడు గుండా రామకృష్ణ

ప్రజాశక్తి - వీరవాసరం

ఇటీవల మృతిచెందిన విలేకరి సుబ్బరాజు మృతి చాలా బాధాకరమని ఎపిడబ్ల్యూజెఎఫ్ జిల్లా అధ్యక్షుడు గుండా రామకృష్ణ అన్నారు. ఆదివారం ఆయన ఎపిడబ్ల్యూజెఎఫ్ తరపున సంతాపం వ్యక్తం చేశారు. ఫెడరేషన్ ఏ కార్యక్రమానికైనా పిలుపునిస్తే సుబ్బరాజు తప్పనిసరిగా పాల్గొనే వారన్నారు. పత్రికా రంగంలో సుబ్బరాజు విలేఖరిగా విశేషమైన సేవలందించారన్నారు. సుదీర్ఘకాలం పాటు ప్రజాశక్తిలో సుబ్బరాజు సేవలందించారని, ఆ తర్వాత వజ్రభారతి అనే పత్రికలో పనిచేస్తూ తనకంటూ ఒక ఒరవడిని సృష్టించుకున్నారని అన్నారు. ఫెడరేషన్ జిల్లా శాఖ తరపున సుబ్బరాజు కుటుంబానికి సానుభూతి వ్యక్తం చేశారు.

శ్రీనివాస్‌కు పలువురి పరామర్శ

ప్రజాశక్తి - యలమంచిలి


నివాళులర్పిస్తున్న నేతలు

టిడిపి యువ నాయకుడు, ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షుడు పీతల శ్రీనివాస్ తండ్రి పీతల కృష్ణమూర్తి ఇటీవల మృతి చెందడంతో వారి స్వగ్రామం కాజా తూర్పు గ్రామంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్ రావు, జిల్లా ముఖ్య నేతలతో పాటు మండలంలోని వివిధ గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో హాజరైన ప్రజలు శ్రీనివాస్‌ను పరామర్శించారు.

రాంబాబు మృతి తీరని లోటు

మానవత ప్రెసిడెంట్ డాక్టర్ రంగరాజు

ఉండి: మానవత శాంతి రథాల ఛైర్మన్ అప్పక రాంబాబు మృతి మానవతకు తీరనిలోటు అని ఉండి మానవత సంస్థ అధ్యక్షులు డాక్టర్ గాదిరాజు రంగరాజు అన్నారు. మానవత సంస్థ నెలవారీ సమావేశం ఉండి ప్రజా సంఘాల భవనంలో ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో రాంబాబు మృతికి సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ గాదిరాజు రంగరాజు మాట్లాడుతూ మానవత శాఖకు పూర్వపు అధ్యక్షులుగా ఎనలేని సేవ చేశారని వక్తలు తెలిపారు. సెంట్రల్ కమిటీ ఛైర్మన్, మానవత విస్తరణలో అపూర్వమైన పాత్ర పోషించారని అన్నారు. మండల కో ఛైర్మెన్ దంగేటి రామలింగేశ్వరరావు, మండల కన్వీనర్ కొమ్మన నాగబాబు, పెన్మెత్స రంగప్రసాదరాజు, పిల్లలమర్రి శ్యామలరావు తదితరులు పాల్గొని మాట్లాడారు.

10 మంది వృద్ధులకు వైద్యసేవలు

తణుకు: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ వారు సంయుక్తంగా నిర్వహించు ఇంటింటికీ వైద్యం కార్యక్రమంలో భాగంగా ఇంటికే పరిమితమైన అనారోగ్య వృద్ధులకు సంచారశకటం ద్వారా వైద్యులు ఆదివారం ఉచిత వైద్య సేవలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్‌అహ్మద్, ఆర్థో డాక్టర్ నిమ్మగడ్డ అచ్యుతరామయ్యలు తణుకు పట్టణ ప్రాంతంలో పర్యటించి 10 మంది వృద్ధులకు ఉచిత వైద్యసేవలు అందజేశారు. చలసాని కృష్ణవరప్రసాద్ ఆర్థిక సహకారంతో ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ కోశాధికారి అర్జి భాస్కరరావు, సభ్యులు గిరిజాల నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ ఉచిత వైద్య సేవలు కోరువారు స్వయంగా గాని లేదా సెల్ నెంబర్ 9985343530, 9059290717లకు తెలియజేయగలరు.

వారసత్వ ఆస్తి రిజిస్ట్రేషన్‌కు భారీ మొత్తంలో వసూళ్లు!

నరసాపురం: తల్లిదండ్రుల నుండి వారసత్వంగా వచ్చిన ఆస్తిని వారి కుటుంబ సభ్యులకు ఇష్టపూర్వకంగా రాసుకునే హక్కు ఉంటుందని, దీనికి ఆధారంగా వారికి ఇచ్చే ఆస్తికి రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు అతి తక్కువ ఖర్చుతో ప్రభుత్వం వెసులుబాటు కల్పించిందని యర్రశెట్టివారి పాలెం మాజీ సర్పంచి కూనపురెడ్డి వీర వెంకట విజయ రంగారావు పేర్కొన్నారు. ఈమేరకు ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు. స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఈ వారసత్వపు ఆస్తిని బదిలీ చేయాలంటే వాస్తవానికి రూ.100 నుండి 1000 వరకు అవుతుందని, కానీ ప్రభుత్వం ఇచ్చిన జిఒకు వ్యతిరేకంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అదనపు సొమ్ము రూ.25 వేల నుంచి 35 వేల వరకు వసూలు చేసి సామాన్యులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని విజయ రంగారావు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతానని అన్నారు. ఇటీవల కాలంలో తన భార్య కాలం చేసిందని, భార్య నుండి సంక్రమించిన ఆస్తిని తన కుమారుడు, కుమార్తెకు ఇచ్చేందుకు రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లగా సుమారు రూ.2 వేలతో అవ్వవలసిన రిజిస్ట్రేషన్‌కు రూ.25 వేల నుండి 35 వేల వరకు వసూలు చేశారని, తద్వారా కూటమి ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ అక్రమ వసూళ్ల దందాను సంబంధిత అధికారులు పరిగణలోకి తీసుకొని తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

దేవస్థాన నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం

పెనుమంట్ర : మండలంలోని భట్లమగుటూరు గ్రామంలో ఉన్న శ్రీ కేశవ స్వామి దేవస్థానానికి నూతన కార్యవర్గం ఛైర్మన్ వర్లకవి దుర్గాప్రసాద్ రాజు నియమితులయ్యారు. ఆదివారం దేవాలయ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ధర్మకర్త మండలి సభ్యులుగా వేండ్ర శ్రీనివాసరావు, జంగం చిట్టిబాబు, గంటి వెంకన్న, చింతాడ నాగమణి, మర్రి వెంకటరమణ, జక్కంశెట్టి సీతా మహాలక్ష్మి, ఇల్లిందుపల్లి మహాలక్ష్మి, అర్చకులు అగ్నిహోత్రం దక్షిణామూర్తి ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ తనయుడు పితాని వెంకట్ ముఖ్య అతిథిగా విచ్చేసి వర్లకవి దుర్గాప్రసాద్ రాజు, ధర్మకర్తల మండలితో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం గ్రామపంచాయతీ వద్ద ఉన్న మహంకాళి అమ్మ వారి గుడికి రోడ్డుకు డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు వెలగల బులి రామిరెడ్డి, సొసైటీ సభ్యులు కడలి ఏడుకొండలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలపై వినతుల స్వీకరణ

ఎన్‌జిఒ అధ్యక్షులు గుడాల హరిబాబు

పాలకొల్లు : ఈనెల 30వ తేదీ మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు పాలకొల్లు ఐయస్ కమ్యూనిటీ హాల్లో పాలకొల్లు ఎన్‌జిఒ అసోసియేషన్ ప్రాంతీయ యూనిట్ కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం జరుగుతుందని ఎన్‌జిఒ సంఘ అధ్యక్షులు గుడాల హరిబాబు తెలిపారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షులు చోడగిరి శ్రీనివాసరావు, కార్యదర్శి నెరుసు రామారావు, జెఎసి రాష్ట్ర నాయకులు ఆర్ఎస్.హరనాథ్ సమావేశానికి వస్తున్నట్లు తెలిపారు. వివిధ శాఖల ఉద్యోగులు తమ సమస్యలపై వినతి పత్రాలు సమర్పించవచ్చని, వాటిని జిల్లా, రాష్ట్ర స్థాయి నాయకత్వం దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. ఈ ప్రమాణ స్వీకారానికి ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక పెన్షనర్ సంఘ నాయకులు, అన్ని ఉద్యోగ సంఘ నాయకులు, ఉద్యోగులు పాల్గొనాలని హరిబాబు కోరారు.

వల్లూరులో రక్తదాన శిబిరం

ఆచంట: ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు రక్తదాన శిబిరాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని ఎంఎల్ఎ పితాని తనయుడు పితాని వెంకట్ అన్నారు. ఆదివారం మండలంలోని వల్లూరు గ్రామంలో ఎన్‌టిఆర్ ఫ్యాన్స్, జనసేన ఆధ్వర్యంలో పాలకొల్లు వాసవి సౌజన్యంతో బ్లడ్ బ్యాంక్ వారిచే నిర్వహించిన మెగా రక్త దాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన 50 మంది యువకులను అభినందించారు. ఈ సందర్భంగా యువకులకు సర్టిఫికెట్ ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు తోట ఆదినారాయణ, నాయకులు తాళం శ్రీనివాసరావు, చిట్టూరి శ్రీనివాసరావు, కామెడి ఉమామహేశ్వరరావు, పిచ్చెట్టి వెంకటేశ్వరరావు, దివి రాజు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్య పరిష్కారమే ఎన్‌టిఎ లక్ష్యం

ఉండి: ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా నోబుల్ టీచర్స్ అసోసియేషన్ పనిచేస్తుందని జిల్లా ప్రధాన కార్యదర్శి పిఎస్ఎన్.రాజు తెలిపారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన డిఎస్‌సి 2025 ద్వారా ఎంపికైనటువంటి అర్హత పొందిన 15 మంది ఉపాధ్యాయులకు ఏలూరు జిల్లాలో జాయినింగ్ ఆర్డర్ ఇవ్వకపోవడంతో వారి సమస్యను పిఎస్ఎన్ రాజు సహకారంతో స్థానిక ఎంఎల్ఎ, డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణంరాజు దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఆయన ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి, దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కరించడంతో 15 మంది ఉపాధ్యాయులకు జాయినింగ్ ఆర్డర్ ఇవ్వడంతో వారికి జీతాలు వచ్చాయి. తమకు జాయినింగ్ ఆర్డర్లు ఇప్పించడంలో కృషి చేసిన డిప్యూటీ స్పీకర్, ఎన్‌టిఎ జిల్లా ప్రధాన కార్యదర్శి పిఎస్ఎన్ రాజులను ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం రఘురామకృష్ణంరాజు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు. ఉపాధ్యాయుల సమస్యను తన దృష్టికి తీసుకువచ్చిన నోబుల్ టీచర్స్ అసోసియేషన్ ను ఆయన అభినందించారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ఆకివీడు మెయిన్ సెంటర్లో చిల్లర వ్యాపారాలకు గిడ్డంగిగా మారిన గ్రంథాలయం

గ్రంథాలయం వెలుపల పరిస్థితి

నాడు గ్రంథాలయం.. నేడు గిడ్డంగి

పాలకుల నిర్లక్ష్యం : పాఠకులకు శాపం

ప్రజాశక్తి - ఆకివీడు

ఒకప్పుడు అది విజ్ఞాన గని, అక్కడ పుస్తకాలు, పత్రికల కోసం చెప్పుకోదగ్గ స్థాయిలో ఆదరణ ఉండేది. నాకు ఆ పుస్తకం కావాలి అంటూ నాలుగు రోజులు ముందే బుక్ చేసుకునేవారు. అడిగిన వారిని ప్రయారిటీ ప్రకారం పుస్తకాలనందిస్తూ ఉండేవారు అక్కడ గ్రంథాలయ నిర్వాహకులు. నేడు అది చిల్లర వ్యాపారులకు అడ్డాగా మారింది. అదే ఆకివీడు నగర పంచాయతీ నడిబొడ్డిలో ఉన్న గ్రంథాలయ భవనం.

స్థానిక డైలీ మార్కెట్ సెంటర్లో ఉన్న ఈ గ్రంథాలయానికి ఒకప్పుడు ఫుల్ డిమాండ్ ఉండేది. సుమారు 60 సంవత్సరాల క్రితం ప్రారంభించిన ఈ గ్రంథాలయం నాలుగు సంవత్సరాల క్రితం వరకు కూడా కలకల్లాడుతూ నడిచింది. సుమారు వెయ్యి పుస్తకాలకుపైగా ఇక్కడ ఉండేవి. పది రకాల దినపత్రికలు, వారపత్రికలు, ఎంప్లాయిమెంట్ న్యూస్ పక్షపత్రిక, మాస పత్రిక సైతం ఇక్కడ ఉండేవి. ఈ పత్రికలు చదివి అదనంగా పుస్తకాలు చదవాల్సిన అవసరమే లేకుండా ఉద్యోగం సాధించిన యువకులు ఎక్కడెక్కడో స్థిరపడ్డారు అంటే ఆశ్చర్యం కాదు.

అంతటి ఘన చరిత్ర కలిగిన ఈ గ్రంథాలయం నేడు పూర్తిగా కనుమరుగైపోయింది. పుస్తకాలు ఏమయ్యాయో తెలియని పరిస్థితి నెలకొంది. పూర్తిస్థాయి గ్రంథాలయ పాలకులను సైతం ఒకప్పుడు పంచాయతీరాజ్ శాఖ నియమించింది. మున్సిపాలిటీ చేతుల్లోకి వచ్చాక గ్రంథాలయం తీసేశారు. ఈ గ్రంథాలయం డైలీ మార్కెట్ సెంటర్‌లో ఊరికి నడిబొడ్డున రేకుల షెడ్డుగా మాత్రం ఉండేది. వేరొక చోటకు మార్చి పూర్తిస్థాయి భవనం కట్టాలని అనేకమంది, అనేకసార్లు విజ్ఞాపన చేశారు. గ్రంథాలయం చుట్టూ మార్కెట్, ఒకపక్క జాతీయ రహదారి ఉండడంతో రణగణ ధ్వనిగా ఉందని అనేకసార్లు విజ్ఞాపన చేశారు. అయితే పంచాయతీ అధికారులు మాత్రం ఒకటి రెండు చోట్ల స్థలాన్ని ప్రతిపాదించినప్పటికీ నిధులు లేక గ్రంథాలయ భవన నిర్మాణం మాత్రం జరగలేదు. ఈ స్థితిలో పంచాయతీ కాస్తా నగర పంచాయతీగా మారి మున్సిపాలిటీలోకి వెళ్లింది. ఇక ఆ రోజు నుండి అధికారుల నిర్లక్ష్యం మొదలైంది. సుమారు రెండు సంవత్సరాలకుపైగా ఎన్నికలు లేకుండా అధికారుల పాలనలో సాగిన కాలంలో ఈ గ్రంథాలయం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైంది. ఆ తరువాత పాలకులు, పాలకవర్గం ఏర్పడినా.. సిబ్బంది లేకపోవడంతో చేతులెత్తేశారు. ఇప్పటికీ నగర పంచాయతీలో సిబ్బంది 10 శాతం మాత్రమే పనిచేస్తున్నారు. ప్రస్తుతం ఈ గ్రంథాలయం చుట్టూ రకరకాల చిల్లర వ్యాపారాలు పుట్టుకొచ్చాయి. కూరగాయలు, పళ్లు, ఇతర చిల్లర వ్యాపారులకు ఈ గ్రంథాలయ గదులు గిడ్డంగులుగా మారాయి. మరోపక్క గ్రంథాలయం కూలిపోతోంది. షెడ్డు తీసేసి స్థలం వేలం పెట్టినా కోటి రూపాయలపైనే వచ్చే స్థలం ఇది. ఎందరికో విజ్ఞానాన్ని అందించిన విజ్ఞాన ఫలం కనుమరుగైపోయింది. ప్రభుత్వ ఆస్తి పరాయి పాలవుతోంది.. అయినా అటు పాలకులకు గాని, ఇటు సిబ్బందికి గాని పట్టకపోవడం దయనీయం. వెంటనే ఈ స్థలాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకొని ఒక భవనాన్ని నిర్మించి, పూర్తిస్థాయి గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయాలని ఇక్కడ యువత కోరుతోంది.

పిఎం లంక ప్రజలే నన్ను దత్తత తీసుకున్నారు

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్

ప్రజాశక్తి - నరసాపురం

విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న మంత్రులు

పిఎం లంక గ్రామాన్ని నేను దత్తత తీసుకోవడం కాదు, ఈ గ్రామ ప్రజలే నన్ను దత్తత తీసుకున్నారని కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. మంత్రి నిర్మలా సీతారామన్ జిల్లా పర్యటన సందర్భంగా ఆదివారం పెదమైనవానిలంక గ్రామంలో డిజిటల్ భవన్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు ప్రశంసా పత్రాలు, మెమొంటోలు ఆమె అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పిఎం లంక గ్రామం అభివృద్ధి గ్రామ మహిళల మద్దతుతోనే సాధ్యమైందన్నారు. పిఎం లంకలో నిర్మించిన సైక్లోన్ భవనం అన్ని విధాలుగా ఉపయోగపడడం సంతోషకరమన్నారు. రైతులు, మహిళలు డ్రోన్లు వినియోగించే స్థాయికి చేరుకోవాలన్నారు. అలల తాకిడిని ఆపేందుకు అధునాతన టెక్నాలజీతో అడ్డుకట్ట నిర్మాణాన్ని చేపట్టడం జరిగిందన్నారు. పిఎం లంక వాసులకు పిఎం ఆవాస్ యోజన కింద 146 మందికి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, అవి రాబోయే 12 నెలలలో పూర్తి చేయాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. మత్స్యకారులకు బోట్లు అందించేందుకు దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, అవి కూడా ఇచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని నిర్మలా సీతారామన్ సూచించారు. కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, రాష్ట్ర ఆర్థిక శాఖా మంత్రి పయ్యావుల కేశవ్, రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు, కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడారు. నరసాపురం ఎంఎల్ఎ, విప్ బొమ్మిడి నాయకర్ పేరుపాలెం బీచ్‌కి ప్రసిద్ధి అని అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ మాట్లాడారు. అనంతరం పిఎం లంక సముద్ర తీరాన సముద్రపు కోతకు గురి కాకుండా సిఎస్ఆర్ నిధులు రూ.13.50 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న అడ్డుకట్ట నిర్మాణం పనులను కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి, కేంద్ర, రాష్ట్ర మంత్రులతో కలిసి స్వయంగా పరిశీలించి, ప్రాజెక్ట్ చేపట్టిన ఎలైట్ కంపెనీ ప్రతినిధులతో మాట్లాడి వివరాలను తెలుసుకుని, పనుల నిర్మాణం, ప్రెజెంటేషన్, ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, గ్రామ సర్పంచి కొల్లాటి కనకదుర్గ పాల్గొన్నారు.

మన్ కీ బాత్ 129వ ఎపిసోడ్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన నరసాపురం లేస్ పరిశ్రమ, లేస్ పని చేసే మహిళల గురించి గర్వంగా ప్రస్తావించడం మన జిల్లాకు ఎంతో గర్వకారణమని మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. భారత ప్రధాని నరేంద్ర మోడీ తన ప్రసంగంలో నరసాపురం మహిళలు తమ చేతివృత్తి ద్వారా తయారు చేసే లేస్ ఉత్పత్తులు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారన్నారు. ఇది లోకల్ ఫర్ వోకల్ అనే నినాదానికి ఒక చక్కని ఉదాహరణ అని కొనియాడారు. 250 గ్రామాల్లో లక్షలాది మంది గ్రామీణ మహిళలు ఈ కళ ద్వారా స్వయం ఉపాధి పొందుతూ, ఆర్థికంగా ఎదగడం పట్ల ప్రధాని ప్రశంసలు కురిపించారు. మహిళలు ఇలాంటి పురాతన కళలను కాపాడుకుంటూ వృత్తిలో రాణించడం దేశానికి గర్వకారణమని చెప్పారు. నరసాపురం లేస్ అభివృద్ధికి కలెక్టర్ నాగరాణి ఎంతో కృషి చేశారు.

కవిటం ఉమామహేశ్వర స్వామి ఆలయం సందర్శన

పోడూరు : కవిటం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీపార్వతీ సమేత ఉమామహేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణాన్ని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా పాత శివాలయంలో ప్రత్యేక పూజలో పాల్గొని, వేద పండితుల ఆశీర్వచనాలను అందుకున్నారు. కార్యక్రమంలో కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు, కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ, దేవాదాయ శాఖ రీజనల్ జాయింట్ కమిషనర్ త్రినాథ రావు, జిల్లా దేవాదాయ శాఖ అధికారి హరి సూర్య ప్రకాష్, కూటమి నాయకులు ఉన్నారు.

బీచ్‌లో ప్రత్యేక ఆకర్షణగా సైకత శిల్పం

నరసాపురం : మండలంలోని పెదమైనవానిలంకలో కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా సముద్ర తీరంలో ఆమె గౌరవార్థం ఏర్పాటు చేసిన సైకత శిల్పం అందరినీ ఆకట్టుకుంది. 'గ్రామ అభివృద్ధి ప్రదాత నిర్మలా సీతారామన్‌కు సుస్వాగతం' అంటూ రూపొందించిన సైకత శిల్పాన్ని స్థానికులు ఆసక్తిగా తిలకించారు. మంత్రి పర్యటన నేపథ్యంలో తీర ప్రాంతంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సైకత శిల్పం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

బీచ్‌లో ఏర్పాటు చేసిన సైకత శిల్పం

ఎస్ఎస్‌సి మోడల్ పేపర్ బుక్స్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - నరసాపురం

మెటీరియల్ ఆవిష్కరిస్తున్న ఎంఎల్ఎ నాయకర్

శ్రీసూర్య జూనియర్ కళాశాల వారు నియోజకవర్గంలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్ పాఠశాలల పదవ తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో ప్రత్యేకంగా రూపొందించిన ఎస్ఎస్‌సి మోడల్ పేపర్స్ బుక్ 2,500 కాపీలను అందిస్తున్నారు. ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ చేతుల మీదుగా నరసాపురంలోని పీచుపాలెం ఉన్నత పాఠశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ విద్యార్థి జీవితంలో పదవ తరగతి అతి ముఖ్యమైనది, విద్యార్థి ఉన్నత లక్ష్యం చేరాలంటే ఆ ఒక్క సంవత్సరం పడిన కష్టం పైనే ఆధారపడి ఉంటుందన్నారు. శ్రీ సూర్య జూనియర్ కాలేజీ వారు అందిస్తున్న ఈ ప్రత్యేక ఎస్ఎస్‌సి మోడల్ పేపర్స్ బుక్ ఎక్కువ మార్కులు సాధించడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. నరసాపురం నియోజకవర్గంలో ప్రతి విద్యార్థి పదవ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించి రాష్ట్రంలోనే నియోజకవర్గాన్ని ఉన్నత స్థాయిలో ఉంచడం తన ఆశయమని, ఆ అభిలాషను నెరవేర్చే దిశగా ప్రయత్నం చేస్తున్న శ్రీ సూర్య జూనియర్ కళాశాల యాజమాన్యం వారిని ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో శ్రీసూర్య విద్యా సంస్థల సెక్రటరీ, కరస్పాండెంట్ ఘంటసాల బ్రహ్మాజీ, బొమ్మిడి సూర్యకుమారి, కృష్ణమూర్తి, అకడమిక్ అడ్వైజర్ బి.రామచంద్రా రెడ్డి, పీచు పాలెం హై స్కూల్ ఇన్‌ఛార్జి హెచ్‌ఎం జ్యోత్స్న పాల్గొన్నారు.

నేడు చించినాడ పోరాట యోధురాలు సత్యనారాయణమ్మ సంస్మరణ సభ

యలమంచిలి: మండలంలోని చించినాడ గ్రామానికి చెందిన పోరాట యోధురాలు, చించినాడ మాజీ సర్పంచి పెచ్చెట్టి సత్యనారాయణమ్మ సంస్మరణ సభ సోమవారం ఉదయం 10 గంటలకు చించినాడ గ్రామంలోని సత్యనారాయణమ్మ స్వగృహం వద్ద జరుగుతుందని ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సంస్మరణ సభకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి.బలరాం, సిపిఎం రాష్ట్ర నేత మంతెన సీతారాం, సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్, దిగుపాటి రాజగోపాల్, సిపిఎం సీనియర్ నేత కేతా సూర్యారావు, ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బాతిరెడ్డి జార్జి, జక్కంశెట్టి సత్యనారాయణ హాజరవుతున్నారని, జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

డ్రెయినేజీ పనులకు శంకుస్థాపన

పెనుమంట్ర : మండలంలోని కొయ్యేటిపాడు గ్రామంలో పిఎంఎ గ్రామీణ యోజన పథకం నిధులు రూ.20 లక్షల అంచనా వ్యయంతో ఎస్‌సి కాలనీలో డ్రెయినేజీల పనులకు ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ తనయుడు పితాని వెంకట్ శంకుస్థాపన చేశారు. మండలంలోని కూటమి నాయకులు వెలగల బులిరామిరెడ్డి, గూడూరి మురళీ మోహన్, చింతపల్లి రామకృష్ణ, అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.

కౌశల్ జిల్లా కోఆర్డినేటర్ రాపాకకు అభినందన జ్ఞాపిక

అభినందించిన రాష్ట్ర మంత్రి సత్య కుమార్ యాదవ్

జ్ఞాపిక అందుకుంటున్న వెంకన్న బాబు

భీమవరం : రాష్ట్ర ఆరోగ్యం కుటుంబ సంక్షేమం, వైద్య విద్యాశాఖ మంత్రి వై.సత్య కుమార్ యాదవ్ చేతుల మీదుగా కౌశల్ జిల్లా కోఆర్డినేటర్ రాపాక వెంకన్నబాబు అభినందన జ్ఞాపికను అందుకున్నారు. తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం ప్రాంగణంలో కౌశల్-2025 రాష్ట్రస్థాయి విజేతలకు బహుమతి ప్రదానోత్సవ సభలో జిల్లాలో కౌశల్-2025 సైన్స్ ప్రతిభ అన్వేషణ పోటీలను నిర్వహించటంలో గణిత ఉపాధ్యాయుడు రాపాక వెంకన్నబాబు జిల్లా కోఆర్డినేటర్‌గా సేవలందించినందుకు ఈ జ్ఞాపికను అందుకోవడం జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన సత్యకుమార్ యాదవ్ చేతుల మీదుగా వెంకన్న బాబు అభినందన జ్ఞాపికను అందుకున్నారు.

'స్వచ్ఛంద సంస్థల కృషి అభినందనీయం'

పాలకొల్లు : సమాజాభివృద్ధికి స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న కృషి అభినందనీయమని మాజీ ఎంఎల్ఎ డాక్టర్ బాబ్జీ చెప్పారు. పాలకొల్లు లయన్స్ కమ్యూనిటీ హాల్లో ఆదివారం పొట్నూరి ఫౌండేషన్ ఛైర్మన్ మనవడు మొదటి పుట్టిన రోజు సందర్భంగా మహిళలకు కుట్టు మిషన్‌ల పంపిణీ, రక్తదాన శిబిరంను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లయన్స్, రోటరీ క్లబ్‌లతో పాటు పలు స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. సభలో 50 మంది బీద బ్రాహ్మణులకు నిత్యావసరాలు, బియ్యం కిట్టులను మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ఛైర్మన్ పొట్నూరి అప్పన్న, మాజీ కౌన్సిలర్ పొట్నూరి భవాని, తటవర్తి సుధాకర్ పాల్గొన్నారు.

డిమాన్ పవన్‌కు ఘన స్వాగతం


పవన్‌ను సత్కరిస్తున్న ఎంఎల్ఎ

తణుకు : బిగ్‌బాస్ 9 షో అనంతరం మొట్టమొదటిసారిగా తణుకు పట్టణానికి విచ్చేసిన తణుకు కుర్రోడు డిమాన్ పవన్‌కు తణుకు పట్టణ ప్రజలు, బంధువులు, స్నేహితులు పైడిపర్రు వై జంక్షన్ వద్ద ఆదివారం ఉదయం ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం బైక్ ర్యాలీగా పైడిపర్రు వై జంక్షన్ నుండి వెంకటేశ్వర థియేటర్, నరేంద్ర సెంటర్, కేశవస్వామి గుడి, రాజీవ్‌చౌక్ సెంటర్, వికె కన్వెంక్షన్ వెనుక ఉన్న స్వగృహానికి చేరుకున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు పాలంగిలోని డిమాన్ పవన్ మేనమావ బొద్దాని కాశీవిశ్వనాథం ఇంటి వద్ద భారీ కేక్ కటింగ్ చేశారు.

బిగ్‌బాస్ సీజన్ 9లో అంచనాలకు మించి ప్రతిభ చూపించి తృతీయ స్థానంలో నిలిచిన డిమాన్ పవన్‌కు తణుకు ప్రజలు అండగా నిలిచారని ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ కొనియాడారు. పట్టణానికి చెందిన డిమాన్ పవన్ ఆదివారం ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పవన్‌ను ఎంఎల్ఎ ఘనంగా సత్కరించారు. అనంతరం రాధాకృష్ణ మాట్లాడుతూ.. తాము ఎంచుకున్న రంగాల్లో యువకులు ఉన్నత స్థానానికి వెళ్లే విధంగా పట్టుదల, కృషితో సాధించిన పవన్ యువతకు స్ఫూర్తిగా నిలిచారని అన్నారు. ఈ సందర్భంగా పవన్‌తో పాటు తల్లిదండ్రులను ఎంఎల్ఎ రాధాకృష్ణ అభినందించారు.

ఎస్‌పి కార్యాలయ పిజిఆర్ఎస్ మార్పు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ప్రతి సోమవారం జిల్లా ఎస్‌పి కార్యాలయంలో నిర్వహించే పిజిఆర్ఎస్(మీకోసం) ఈ ప్రాంతంలో రోడ్డు మరమ్మతుల కారణంగా భీమవరం డిఎస్‌పి కార్యాలయంలో నిర్వహించినట్లు ఎస్‌పి కార్యాలయం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపింది. ఫిర్యాదుదారులు ఈ మార్పును గమనించి భీమవరం డిఎస్‌పి కార్యాలయానికి రావాలని కోరారు.

గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన

పితాని తనయుడు వెంకట్

ప్రజాశక్తి - ఆచంట

గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, ఇందులో భాగంగా పల్లె పండుగ కార్యక్రమం ప్రారంభించినట్లు ఎంఎల్ఎ తనయుడు పితాని వెంకట్ అన్నారు. ఆచంట వేమవరం గ్రామంలో ఆదివారం మంచినీటి ట్యాంకులకు ఆయన శంకుస్థాపన చేశారు. వెంకటాయపాలెంలో రూ.16 లక్షల అంచనా వ్యయం, లింగరాజు చెరువు రూ.32 లక్షల అంచనా వ్యయం, పెద్ద అరుంధతి పేటలో రూ.16 లక్షల అంచనా వ్యయంతో ఒఆర్ఎస్‌హెచ్ ట్యాంకులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సర్పంచి జక్కంశెట్టి చంటి, బికెడి ప్రసాద్, దొంగ నాగర్జున, కూటమి నాయకులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనలో శ్రద్ధ వహించాలి

తణుకు సబ్ యూనిట్ అధికారి జి.వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - పెనుమంట్ర

హాస్టల్‌లో ఉండి చదువుకుంటున్న విద్యార్థులకు మౌలిక సదుపాయాలు అందించడంలో శ్రద్ధ వహించాలని తణుకు సబ్ యూనిట్ అధికారి జి.వెంకటేశ్వరరావు అన్నారు. పెనుమంట్ర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పొలమూరు గ్రామంలో సోషల్ వెల్ఫేర్ బాయ్స్ హాస్టల్‌ను ఆయన సందర్శించి సిబ్బందికి సూచనలు ఇచ్చారు. హాస్టల్‌లో మస్కిటో మెషింగ్ ప్రూఫ్, బెడ్ రూమ్స్, కిచెన్ రూమ్, టాయిలెట్స్, తాగునీరు సరఫరా యూనిట్‌లను పరిశీలించి, సిబ్బందికి తగు మార్గదర్శక సూచనలు చేశారు. ఈ విజిట్‌లో హెల్త్ సిబ్బంది కూర్మదాసు మల్లేశ్వరరావు, విలేజ్ హెల్త్ సెక్రెటరీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా యూత్ క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - పెనుమంట్ర

స్థానిక సెయింట్ స్టెఫన్ లూథరన్ చర్చిలో యూత్ క్రిస్మస్ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పారిస్ పాస్టర్ రెవరెండ్ దాసి రాజారత్నం, సంఘ సిఆర్ దుండి నాగేశ్వరరావు, పాస్టర్ రెవరెండ్ దాయం జాన్సన్ దైవ వర్తమానికులు జి.రాజాబాబు తదితరులు క్రిస్మస్ సందేశాలు అందించారు. ఈ కార్యక్రమానికి, పెనుమంట్ర గ్రామ సర్పంచి తాడిపర్తి ప్రియాంక ప్రసన్నకుమార్ పాల్గొని యూత్ సభ్యులకు శుభాశీస్సులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ వార్డు సభ్యులు చలమల దుర్గ, నాయకులు నరాల శెట్టి వెంకటేశ్వరరావు, క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియపరిచారు. ఈ కార్యక్రమం తదానంతరం యూత్ ఆధ్వర్యాన స్థానికులు అందరికీ క్రిస్మస్ విందు అందించారు.

టిడిపి సీనియర్ నాయకుడు సాంబశివరావు మృతి

ప్రజాశక్తి - ఆకివీడు

టిడిపి సీనియర్ నాయకులు అల్లు సాంబశివరావు(71) ఆదివారం ఉదయం మృతిచెందారు. టిడిపి ప్రారంభమైన నాటి నుండి ఆ పార్టీ సభ్యునిగా, వార్డు నాయకుడిగా రాజకీయ జీవితం ప్రారంభించారు. క్రమంగా పార్టీ పట్టణ కార్యదర్శిగా, బిసి సెల్ మండల అధ్యక్షులుగా పనిచేశారు. ప్రస్తుతం ఆయన కుమారుడు పార్టీ క్రియాశీలక సభ్యులుగా కొనసాగుతున్నారు. ఇటీవల అనారోగ్యంతో ఉన్న ఆయన ఆదివారం ఉదయం మరణించారు. టిడిపి నాయకులు పలువురు ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. పార్టీ సీనియర్ నాయకులు మోటుపల్లి రామవరప్రసాద్, మండల అధ్యక్ష కార్యదర్శులు కోపిల్ల సాయిబాబా, నౌకోట్ల రామారావు, పట్టణ అధ్యక్షుడు గంధం ఉమా సత్యనారాయణ, పలువురు స్థానిక ప్రముఖులు, కూటమి నాయకులు ఆయన కుమారుడు మధు బాబుకు తమ సానుభూతిని తెలిపారు.

జిల్లాలో కూడా ఉత్తమ సేవలు అందించాలి

శ్రీనివాస రెడ్డిని కోరిన ఎంఎల్ఎ పితాని

పెనుమంట్ర : మండలంలో టిడిపికి పాతిక సంవత్సరాల పాటు సేవలు అందించినట్టే, జిల్లాలో కూడా ఉత్తమ సేవలు అందించాలని మాజీ మంత్రి, ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ కోరారు. ఆదివారం టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడిగా తనను నియమించిన సందర్భంగా తమనంపూడి శ్రీనివాస రెడ్డి(బుల్లా) ఆయన్ని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఆయనతో కలిసి మార్టేరు టిడిపి సీనియర్ నాయకులు తేతలి రాజారెడ్డి, మీరా రెడ్డి, మార్టేరు టౌన్ అధ్యక్షులు కోనాల శ్రీనివాసరెడ్డి, అనుమాలచెట్టి రాంబాబు, అబ్బు, కారేపల్లి భాస్కరరావు, అల్లాడ చిన్నారావు, ముండూరు రాజేష్, రొబ్బి భాస్కరరావు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీ కొన్న కారు

వ్యక్తికి గాయాలు : నిలిచిన విద్యుత్ సరఫరా

నరసాపురం: మండలంలోని సీతారామపురం శివారులో ఆదివారం తెల్లవారుజామున కారు విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టింది. స్థానికుల వివరాల ప్రకారం.. తూర్పుతాళు నుండి వస్తున్న కారు రామన్నపాలెం సాయిబాబా గుడి సమీపంలో 11 కెవి విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టింది. కారు నడుపుతున్న వ్యక్తికి గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించారు. విద్యుత్ స్తంభం విరిగిపోవడంతో కొన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సమాచారం అందుకున్న విద్యుత్ శాఖ ఇఇ కె.మధుకుమార్, ఎడిఎ రాజీవ్, ఎఇ ప్రభాకర్, సిబ్బంది విద్యుత్ పునరుద్ధరణ పనులు చేపట్టారు.

CHANGE OF NAME
I, **Nakkella Harischandra Prasad,** S/o Satyanarayana, 6-127, Tadimeti Vari Veedhi, Attili, Attili Mandalam, West Godavari-534134. Have Changed My Name From **Nakkella Hari Chandra Prasad (As Per Passport) (Old Name)** To **Nakkella Harischandra Prasad (As Per Aadhar) (New Name).** Hence After All My Documents (Passport, Etc.,) and Correspondence Will Continue With My New Name **Nakkella Harischandra Prasad.**